క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

ఎమ్మెల్యే ముస్తఫా



పట్నంబజారు: నియోజకవర్గంలో పరిశుభ్రత ప్రమాణాలు పాటించడంలో ముందంజలో ఉండాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా సూచించారు. 55వ డివిజన్ బొంగరాలబీడులో మంగళవారం పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తెలిపిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ క్రిస్మస్ నేపథ్యంలో చర్చిల ఉన్న ప్రాంతాల్లో పరిశుభ్రత వాతావరణం పాటించాలని స్థానికులకు తెలిపారు. కార్యక్రమంలో 55వ డివిజన్ కార్పొరేటర్ పి.అంబేడ్కర్, వైఎస్సార్ సీపీ నేతలు షంషేర్, దాస్, సలాం, మార్కెట్‌శ్రీను, కోట రాందాస్, వినోద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత



గుంటూరు ఎడ్యుకేషన్: దాతలు అందిస్తున్న చేయూతకు తోడు స్వయం ప్రతిభతో విద్యార్థినులు అనుకున్న లక్ష్యాలను సాధించాలని బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం 12 మంది పేద, ప్రతిభావంతులైన విద్యార్థినులకు రూ.1.65 లక్షల ఉపకార వేతనాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి మాట్లాడుతూ గత ఐదేళ్లుగా బొమ్మిడాల ఫౌండేషన్ ద్వారా శ్రీకృష్ణమూర్తి అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందని పేర్కొన్నారు. ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకుని, విద్యార్థినులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపకార వేతన కమిటీ సభ్యులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ కుటుంబరావు, డాక్టర్ పి.విజయలక్ష్మి, ఫౌండేషన్ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపు పాటించాలి



నగరంపాలెం: భావితరాలకు సహజ వనరులు అందించాలంటే ఇంధన పొదుపు పాటించాలని విద్యుత్ శాఖ టౌన్-1 డివిజన్ ఈఈ శ్రీనివాసబాబు అన్నారు. జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాలలో భాగంగా ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, జనరల్ నాలెడ్జ్ ఇతరత్రా అంశాలపై పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ విలువైనదని వృథా కాకుండా కాపాడుకుందామని చెప్పారు. విద్యుత్ పొదుపుతో ఇంధనం ఆదా అవుతుందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యుత్ పొదుపు ఆచరించాలని అన్నారు. కార్యక్రమంలో టౌన్-4 డీఈఈ పీహెచ్ ఖాన్, సీఆర్‌డీఏ కన్‌స్ట్రక్షన్ డీఈఈ జి.సురేష్‌బాబు, డీ-3 ఏఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు.

హనుమాన్ చిత్రం ట్రైలర్ ఆవిష్కరణ

పాత గుంటూరు: జనవరి 12వ తేదీన విడుదల కానున్న హనుమాన్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం సినిమా ట్రైలర్‌ను కొత్తపేటలోని భాస్కర్ థియేటర్‌లో ఆవిష్కరించారు. యూవీ ప్రొడక్షన్ డిస్ట్రిబ్యూటర్ శంకర్ మాట్లాడుతూ ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ఇంద్ర సినిమాలో బాల నటుడిగా నటించిన తేజ సజ్జ హీరోగా నటించిన సినిమాను కుటుంబసమేతంగా చూడాలని ప్రేక్షకులను కోరారు.

విశ్వ బ్రాహ్మణుల అభివృద్ధి, అభ్యున్నతికి కృషి

నెహ్రూనగర్: విశ్వ బ్రాహ్మణుల అభివృద్ధి, అభ్యున్నతికి అందరూ కలిసి కట్టుగా పని చేయాలని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు పిలుపునిచ్చారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తిక మాస వన సమారాధన గుంటూరు అరండల్ పేటలోని విశ్వబ్రాహ్మణ కల్యాణమండపంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు మహానగర వన సమారాధన కమిటీ సభ్యులు గట్టి శ్రీనివాసు, పదిర ఈశ్వరచారి, భరద్వాజ, భద్రయ్య, శివరామబ్రహ్మం, కొటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

బిషప్ రెవ. పరదేశి బాబు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న జోషి తదితరులు

నెహ్రూనగర్: క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి అనుసరణీయమని ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ సంఘం మోడరేటర్ బిషప్ రెవ. డాక్టర్ కే పరదేశి బాబు పేర్కొన్నారు. గుంటూరు ఈస్ట్ ప్యారిస్ చర్చి కమిటీ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎ.జోషి, ఏఈఎల్‌సీ ట్రెజరర్ అర్నాల్డ్ మోజెస్, క్రైస్తవ సంఘం నాయకులు కర్రా హానోక్ బెంజిమెన్, భూపతి సునీల్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవులు చేసే ప్రతి పాప పరిహారం కోసం మానవుని అవతారంలో క్రీస్తు తానే స్వయంగా ఈ లోకంలో జన్మించి తన ప్రాణాన్ని అర్పించి శాశ్వతమైన పరలోక రాజ్యానికి మార్గం చూపించారని చెప్పారు. ఈ సందర్భంగా సండే స్కూల్ విద్యార్థులతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్యారిష్ పాస్టర్ రెవ. డి.చక్రధరరావు, కమిటీ చైర్మన్ వి.శ్యామ్ కరుణాకర్, ట్రెజరర్ కే రవికుమార్, వెస్ట్ ప్యారిస్ పాస్టర్ జి.సతీష్ బాబు, వెస్ట్ ప్యారిస్ పీసీసీ చైర్మన్ బి.మాథ్యూస్, ట్రెజరర్ కె.నిరంజన్ బాబు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

గుంటూరు మెడికల్: ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ పేర్కొన్నారు. జీజీహెచ్ ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో మంగళవారం సెమీ కిస్మస్ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు,



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు

ఆయన చూపిన మార్గం అనుసరణీయమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తోందని, ప్రజలు నమ్మకంతో ఆస్పత్రికి వస్తున్నారని వారికి సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ, ప్రొఫెసర్ డాక్టర్ వీవీ నారాయణ రావు, డాక్టర్ అద్దేపల్లి శ్రీనివాస్, న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ కె.సత్యనారాయణ మూర్తి, సివిల్ సర్జన్, ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, డెప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ ఝాన్సీ పాల్గొన్నారు.

ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండటమే క్రీస్తు సందేశం..

గుంటూరు ఎడ్యుకేషన్: తోటివారిపై ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండటమే క్రీస్తు సందేశమని పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మేరీ చంద్రిక పేర్కొన్నారు. మంగళవారం బ్రాడీపేటలోని సమగ్ర శిక్ష భవిత కేంద్రంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏసుక్రీస్తు బోధనల్లోని పరమార్థాన్ని తెలుపుతూ ఆయన అందించినసేవలను కొనియాడారు. సమగ్రశిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు బోధనల సారాంశాన్ని గుర్తించి, అనుసరించాలని సూచించారు. అనంతరం చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రాష్ట్ర సహాయ సమన్వయకర్త వనజ, జిల్లా సమన్వయకర్త శ్రీనివాస్, గుంటూరు పశ్చిమ ఎంఈఓలు జ్యోతి కిరణ్, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం వైఎస్ జగన్ కృషి

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూరిఫాతిమా



ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేసిన వారితో నూరిఫాతిమా

పట్నంబజారు: కులమతాలకు అతీతంగా ప్రతి పేదవారికి ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు ఏడాదికి ఖర్చుపెడుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. తూర్పు నియోజకవర్గంలోని 15, 17 డివిజన్‌ల పరిధిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో నూతనంగా మంజూరైన వారికి ఆరోగ్యశ్రీ కార్డులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ పేదవారికి మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి సారించి ముందుకు సాగుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామనబోయిన అజయ్‌యాదవ్, షేక్ ఫర్జానా పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్..

నియోజకవర్గంలోని 15వ డివిజన్ శాంతినగర్‌లో మంగళవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఆమె మాట్లాడుతూ సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌కు తిరిగి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రామనబోయిన అజయ్‌యాదవ్, వైఎస్సార్ సీపీ నేతలు గుడే నాగేశ్వరరావు, మద్దిరెడ్డి సుధాకర్, షరీఫుద్దీన్, మురళీ, శ్రీనివాస రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని 3వ డివిజన్ బాలాజీనగర్, 13వ డివిజన్ ఫకీర్‌గూడెం, 56వ డివిజన్ నెహ్రూనగర్‌లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పోలవరపు జ్యోతి, అయిశెట్టి కనకదుర్గ, సంకూరి శ్రీను, వైఎస్సార్ సీపీ నేతలు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, ఆంజనేయులు, అగ్గిపెట్టి రాజు, అంకమ్మరావు, ముస్తఫా, సలాం రమేష్, బోస్, రమణ, రవిరాజ్, ఉస్మాన్, విజయలక్ష్మి, విజయ, హుస్సేన్ పాల్గొన్నారు.

హిందూ కళాశాలలో బోటనీ క్వెస్ట్



విజేతలతో దక్షిణామూర్తి, దుర్గాప్రసాద్, మణికుమారి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో బోటనీ విభాగ ఆధ్వర్యంలో డాక్టర్ టీఎస్ రామారావు స్మారక జిల్లాస్థాయి అంతర్ కళాశాలల ఇంటర్, డిగ్రీ వృక్షశాస్త్ర విద్యార్థులకు బోటనీ క్వెస్ట్ పేరుతో వివిధ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ వైద్య కళాశాల విశ్రాంత ప్రొఫెసర్ ఏవీ దక్షిణామూర్తి విద్యార్థులకు వృక్ష శాస్త్ర పరిజ్ఞానాన్ని ఏ విధంగా పెంపొందించుకోవాలనే విషయమై అవగాహన కల్పించారు. విశిష్ట అతిథులుగా పాల్గొన్న సీవీకేఆర్ రామారావు, డాక్టర్ ఏ రామారావు, కళాశాల అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ కె.కాళిదాస్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ పి.వేణుగోపాల్, డాక్టర్ టీఎస్ రామారావుతో తమకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్, వకృత్వ పోటీలను నిర్వహించారు. నగరంలోని వివిధ కళాశాలల నుంచి 150 మందికి పైగా విద్యార్థులు పోటీ పడ్డారు. డిజిటల్ పోస్టర్ ప్రజెంటేషన్‌లో మాతృశ్రీ, విజ్ఞాన్, జేకేసీ కళాశాల, వక్తృత్వంలో ప్రభుత్వ మహిళా కళాశాల, బీహెచ్, జేఎంజే కళాశాల వరుసగా మొదటి మూడు స్థానాలతో పాటు క్విజ్‌లో విజ్ఞాన్ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాల ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. విజేతలకు నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేశారు.

కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, బోటనీ విభాగాధిపతి డాక్టర్ ఎం.మాధవి, కన్వీనర్ డాక్టర్ జి.రమేష్, కో-కన్వీనర్ జీవీఎస్ సుబ్రహ్మణ్యం, మణికుమారి, డాక్టర్ కృష్ణ పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల విజేతలతో ప్రిన్సిపాల్ మోజెస్, పూర్వ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: స్థానిక ఆంధ్ర క్రైస్తవ (ఏసీ) కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘ ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల క్విజ్ పోటీలు మంగళవారం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ మోస్ట్ రెవరెండ్ కేఎఫ్ పరదేశిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. పూర్వ విద్యార్థి, ఆదాయపు పన్ను శాఖ విశ్రాంత కమిషనర్ మేకతోటి దయాసాగర్ తన తల్లిదండ్రులు, సోదరుని జ్ఞాపకార్థం అందజేసిన రూ.30 వేలతో ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో ప్రభుత్వ మహిళా కళాశాల రూ.20 వేలు, ఏసీ కళాశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి కింద రూ.10 వేలు అందుకున్నారు. బెన్నిసన్ స్పాన్సర్ చేసిన రూ.ఐదు వేలను తృతీయ బహుమతి రూపంలో ఏసీ కళాశాల పీజీ విద్యార్థులు గెలుపొందారు. డీఎస్పీ ఐజక్ ప్రభాకర్ స్పాన్సర్ చేసిన రూ.రెండువేల కన్సొలేషన్ బహుమతులను జేకేసీ కళాశాల విద్యార్థులు గెలుచుకున్నారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం కష్టపడి చదివి, పోటీ పరీక్షల్లో నెగ్గి ప్రజాసేవలో మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థి సంఘ కార్యదర్శి డాక్టర్ ఎఱ్ఱా విజయ్‌శేఖర్, డాక్టర్ మైఖేల్ వినయ తేజ, డాక్టర్ పీబీ శరా, డాక్టర్ డయానా సత్యలత, ప్రభాకర్, రాజశేఖర్, శాంతి ప్రియ రంజని, డాక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.

మేయర్‌తో పోసాని కృష్ణ మురళి భేటీ



నెహ్రూనగర్: కార్పొరేషన్ మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర, నాటకరంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణ మురళి మంగళవారం భేటీ అయ్యారు. సంపత్ నగర్ లోని మేయర్ క్యాంపు కార్యాలయం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 23వ తేదీ నుంచి వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించనున్న నంది నాటకోత్సవ ప్రారంభ వేడుకలకు హాజరుకావాలని ఆహ్వానించారు.

వెండి ఆభరణాలు బహూకరణ



పాత గుంటూరు: మండల పరిధిలోని లాల్‌పురం బాల మురళీకృష్ణ మందిరానికి తాళ్ల పనేని సత్యనారాయణ, వెంకాయమ్మ దంపతులు వెండి ఆభరణాలు బహూకరించారు. జీడీసీసీ చైర్మన్ రాతంశెట్టి సీతారాంజనేయులు సూచన మేరకు 1.5 కిలోల వెండి శతగోపురం, హారతిపల్లెం అందజేశారు. కార్యక్రమంలో ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

26వ తేదీ నాటికి పెండింగ్ అర్జీలు పూర్తి



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ లక్ష్మీ శివజ్యోతి

నెహ్రూనగర్: ఎన్నికల కమిషన్ జనవరి 5న ఓటర్ల తుది జాబితా విడుదల చేయనున్న నేపథ్యంలో పెండింగ్ అర్జీలు ఈ నెల 26వ తేదీ నాటికి పూర్తి చేస్తామని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ ఈఆర్వో కె.లక్ష్మీ శివజ్యోతి తెలిపారు. కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో అదనపు కమిషనర్ ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓటర్ల తుది జాబితా వచ్చే నెల 5న వస్తుందని, ఇప్పటి వరకు డ్రాఫ్ట్ రోల్‌పై అందిన ఫిర్యాదులు, అర్జీలను ఈ నెల 26 నాటికీ పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. అర్జీలు పెండింగ్ ఉన్న బీఎల్‌ఓల వారిగా సమీక్షించి ప్రత్యేక శ్రద్ధతో పూర్తి చేసేలా చూడాలని సూపర్వైజరీ అధికారులను ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశాల్లో అందించిన ఫిర్యాదులు, అర్జీలను క్రమ పద్ధతిలో రికార్డ్ చేసి, క్షేత్ర స్థాయిలో బీఎల్‌ఓలు పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటారన్నారు. సమావేశంలో ఏఈఆర్‌ఓ బి.శ్రీనివాసరావు, మేనేజర్ శివన్నారాయణ, సూపరింటెండెంట్లు సాంబశివరావు, ప్రసాద్, పద్మ, టీడీపీ నుంచి ఓంకార్, బీఎస్పీ నుంచి సీహెచ్ వాసు, బీజేపీ నుంచి ఆర్.భాస్కరరావు, వైఎస్సార్ సీపీ నుంచి జానీ బాషా, ఆమ్ ఆద్మీ నుంచి సేవకుమార్, సీపీఎం నుంచి షేక్ ఖాసిం పాల్గొన్నారు.

పోలీస్ సర్వీస్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



ట్రాఫిక్ కానిస్టేబుల్ నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న జిల్లా ఏఎస్పీ సుప్రజ

నగరంపాలెం: పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి గుంటూరు జిల్లాకు బదిలీపై వచ్చిన సిబ్బంది సర్వీస్ సమస్యలను ఇరవై రోజుల్లో పరిష్కరించాలని జిల్లా ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ ఆదేశించారు. జిల్లాలోని పోలీస్ అధికార, ఆర్మ్‌డ్ రిజర్వ్/ సిబ్బందితో మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో పోలీస్ దర్బార్ నిర్వహించారు. ప్రతి ఒక్కరి నుంచి శాఖపరమైన వినతులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత అర్జీలు, మహిళా పోలీస్ ఇంక్రిమెంట్స్, కుటుంబ సభ్యుల అనారోగ్య సమస్యలు, జిల్లాలోని అధికార/ సిబ్బంది ఇంక్రిమెంట్స్, పోలీస్ వార్షిక ఇంక్రిమెంట్స్, పిల్లలకు సంబంధించిన మెరిటోరియల్ ఉపకార వేతనాలు తదితర వాటిని పరిష్కరించాలని మినిస్టీరియల్ అధికారులకు ఏఎస్పీ సూచించారు. సిబ్బందికి ఏవైనా డీపీఓకు సంబంధించి సమస్యలు ఉన్నట్‌లెతై 8688831302 నంబర్‌కు మెసేజ్ పంపిస్తే వెంటనే పరిష్కరిస్తామని ఏఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో కంట్రోల్ రూం సీఐ ఏ.వీ.శివప్రసాద్, ఆర్‌ఐలు రాఘవయ్య, బ్రహ్మానందం పాల్గొన్నారు.

బ్రెయిన్ బీ పోటీలో విజేతగా నిలిచిన శశాంక్



శశాంక్‌తో కృష్ణప్రసాద్, రథినీచౌదరి

గుంటూరు ఎడ్యుకేషన్: జీజీహెచ్ న్యూరాలజీ విభాగ ఆధ్వర్యంలో ఈనెల 16న నిర్వహించిన అమరావతి ప్రాంతీయ బ్రెయిన్ బీ న్యూరోసైన్స్ క్విజ్ పోటీల్లో డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి కె.శశాంక్ రన్నరప్‌గా నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వై. రథినీచౌదరి తెలిపారు. మంగళవారం జేకేసీ కళాశాలరోడ్డులోని కేఎల్పీ స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో గుంటూరు, విజయవాడ పరిధిలోని ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థి శశాంక్ ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవపున్నయ్య, నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్, కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ఏఓ కె. వెంకట్రావు అభినందించారు.

సింగిల్ నంబరు లాటరీ జూదరుల అరెస్టు

పట్నంబజారు: సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. నల్లచెరువులో సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వీరి నుంచి రూ.7,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

డాక్టర్ భవనం, డాక్టర్ అమర్‌నాథ్‌కు ఇన్నోవేటివ్ అవార్డులు





అవార్డులు అందుకుంటున్న డాక్టర్ భవనం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ అమర్‌నాథ్

గుంటూరు మెడికల్: ఆధునిక వైద్య విధానాలతో వినూత్న చికిత్సా పద్ధతులతో బ్రెయిన్ సర్జరీల్లో అరుదైన ఆపరేషన్‌లు చేస్తూ బాహుబలి సర్జన్‌గా గుర్తింపు తెచ్చుకున్న గుంటూరు బ్రిందా హాస్పిటల్ అధినేత డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డికి ఇన్నోవేటివ్ అవార్డు లభించింది. కేఎల్ యూనివర్సిటీలో అసోసియేషన్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మసీ 17వ వార్షిక సమావేశం మంగళవారం నిర్వహించారు. రోగి మెలకువగా ఉండగానే రోగికి ఇష్టమైన సినిమాలు ల్యాప్‌టాప్‌లో చూపిస్తూ అవేక్ సర్జరీలు చేసి అరుదైన రికార్డును డాక్టర్ శ్రీనివాస రెడ్డి సొంతం చేసుకున్నారు. అత్యంత అరుదైన బ్రెయిన్ ట్యూమర్‌లను గుర్తించి విజయవంతంగా ఆపరేషన్లు చేశారు. బ్రెయిన్ సంబంధిత అరుదైన ఆపరేషన్‌లను కొంతకలంగా చేస్తున్న డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డికి ఇన్నోవేటివ్ అవార్డును అందజేశారు. ఇన్నోవేటివ్ అవార్డు అందుకున్న డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డికి పలువురు న్యూరాలజిస్టులు, న్యూరో సర్జన్లు అభినందనలు తెలిపారు.

డాక్టర్ అమర్‌నాథ్‌కు..

గుంటూరు మెడికల్: ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో వినూత్న చికిత్సా పద్ధతులతో అరుదైన ఆపరేషన్‌లు చేస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న గుంటూరుకు చెందిన సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సూరత్ అమర్‌నాథ్‌కు ఇన్నోవేటివ్ అవార్డు లభించింది. కేఎల్ యూనివర్సిటీలో అసోసియేషన్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మసీ 17వ వార్షిక సమావేశం డాక్టర్ అమర్‌నాథ్ అవార్డు అందుకున్నారు. డాక్టర్ అమర్‌నాథ్ నిరంతరం ప్రయోగాలు చేస్తూ ఖరీదైన, ఆధునిక చికిత్సలను రోగులకు చేరువ చేస్తూ పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులను అందుకున్నారు.

కోవిడ్ అనంతరం అనేక మంది యువకులు తుంటి అరుగుదల సమస్యతో బాధపడడాన్ని గుర్తించి అరిగిన, ఇన్‌ఫెక్షన్ సోకిన తుంటి భాగాన్ని రివర్స్ చేసి ఫెమరల్ రొటేషన్ ఆస్టియోటమి చికిత్స విధానం అందుబాటులోకి తీసుకొచ్చారు. కృతమ తుంటిని అమర్చకుండా సహజంగా ఉన్న తుంటిని అదే స్థానంలో ఉంచి చికిత్స చేసే విధానంతో ఎంతో మందికి మేలు చేకూర్చారు. అంతేకాకుండా మధుమేహం వల్ల దీర్ఘకాలికంగా మానకుండా వేధించే గాయాలను ప్లేట్‌లెట్ థెరఫీ ద్వారా తగ్గించేలా నూతన చికిత్స విధానం అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్లేట్‌లేట్ రిచ్ ప్లాస్మా థెరఫీ పరికరాన్ని తయారు చేసి సదరు పరికరంపై పేటెంట్‌ను కూడా సొంతం చేసుకుని రికార్డు సృష్టించారు. ఇన్నోవేటివ్ అవార్డు అందుకున్న డాక్టర్ అమర్‌నాథ్‌కు పలువురు ఆర్థోపెడిక్ వైద్యులు అభినందనలు తెలిపారు.

విద్యార్థుల ప్రగతిని నిరంతరం పర్యవేక్షించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల ప్రగతిని నిరంతరం పర్యవేక్షించాలని గుంటూరు తూర్పు ఎంఈఓ వి.వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం నందివెలుగు రోడ్డులోని నగరపాలక సంస్థ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసింతో కలసి సందర్శించారు.

ఈసందర్భంగా విద్యార్థుల్లోని అభ్యస సామర్థ్యాలతో పాటు ఎస్ఏ-1 పరీక్షల్లో ప్రగతిని పరిశీలించారు. విద్యార్థుల హాజరు ప్రతిరోజూ పరిశీలించి, గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. జగనన్న అమ్మఒడి పథకానికి విద్యార్థుల హాజరు పరిగణలోకి తీసుకుంటారని తెలిపారు. ఎస్ఏ-1 పరీక్షల్లో విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో స్టెన్‌గన్‌కు ప్రథమ బహుమతి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు మండల స్థాయిలో విద్యాశాఖ నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో బ్రాడీపేటలోని శ్రీశారదానికేతన్ ఓరియెంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రూపొందించిన ప్రాజెక్టు ప్రథమ బహుమతి సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని నర్రా ఉషాకుమారి మంగళవారం తెలిపారు. ఆధునిక జీవనంలో మహిళల ఆత్మరక్షణ కోసం 9వ తరగతి విద్యార్థినులు డి.సంజన, ఎండీ అర్షియ బేగం స్టెన్‌గన్ పేరుతో రూపొందించిన పరికరం ద్వారా స్త్రీలు తమను తాము రక్షించుకోవచ్చునని వివరించారు. అదే విధంగా ఇళ్లలో ఒంటరిగా ఉండే స్త్రీలు, వృద్ధుల రక్షణకు లేజర్ లైట్ సెక్యూరిటీ అలారం సిస్టం ద్వారా రక్షణ పొందవచ్చునని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థినులతో పాటు గైడ్ ఉపాధ్యాయిని పి.ఉషను అభినందించారు.

ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమావేశం నేడు

గుంటూరు రూరల్: ప్రత్తిపాడు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు అభిమానులతో పరిచయ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిలకలూరిపేట రోడ్డులోగల హోటల్ అట్లాంటిస్ రిసార్ట్స్‌లో సాయంత్రం సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జెడ్పీటీసీలు, మండల కన్వీనర్లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, డివిజన్ కన్వీనర్లు, కోఆప్షన్ సభ్యులు, వార్డ్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, సోషల్ మీడియా కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

భాష్యంలో ఉత్కంఠగా సాగిన అబాకస్ మంత్ర



గుంటూరు ఎడ్యుకేషన్: చిన్ననాటి నుంచే విద్యార్థులు అబాకస్ సాధన చేయడం ద్వారా గణితంలో మెరుగైన ఫలితాలను సాధించవచ్చునని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో మంగళవారం అబాకస్ మంత్ర పేరుతో విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గుంటూరులోని రెండు జోన్ల నుంచి మూడు క్యాంపస్‌లకు సంబంధించిన 120 మంది విద్యార్థులు పాల్గొనగా, అర్బన్-1 లిటిల్ ఛాంప్స్ విద్యార్థులు 24 బహుమతులకు గాను 19 బహుమతులను కైవసం చేసుకున్నారని తెలిపారు. ఎక్సెల్ అబాకస్ ఐక్యూ నిర్వాహకురాలు ఎన్.ప్రేమలత కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈసందర్భంగా విజేతలకు భాష్యం రామకృష్ణ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అర్బన్-1 జెడ్ఈఓ శివ, ప్రిన్సిపాల్ కృష్ణకిషోర్, లిటిల్ ఛాంప్స్ ప్రిన్సిపాల్ శిరీష పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

(గుంటూరు ఈస్ట్)

90109 57733

Office mail : sakshigntadvt@gmail.com